క్లుప్తంగా...

నేటి నుంచి జియాగూడ మహంకాళి నవరాత్రి వేడుకలు



జియాగూడ: జియాగూడ మహంకాళి ఆలయంలో ఈనెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శనివారం మాతేశ్వరీ నవరాత్రి వేడుకల వివరాలు వెల్లడించారు. 15న బాలత్రిపురాసుందరీ దేవి, 16న గాయత్రిదేవి, 17న అన్నపూర్ణదేవి, 18 మహాలక్ష్మీ దేవి, 19న మహాచండీ దేవి, 20న సరస్వతి దేవి, 21న లలితా త్రిపురాసుందరి దేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరీ అలంకరణలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, హోమం, హారతి, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, అఖండ హారతి, పల్లకీసేవా, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు పి.బాలకృష్ణ, ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సేవా సమాజ్ చైర్మన్‌గా రాజువస్తాద్



గోల్కొండ: ఈసారి దసరా ఉత్సవాలను భారీగా నిర్వహిస్తామని హిందూ సేవా సమాజ్ చైర్మన్‌గా ఎన్నికైన ఎస్.రాజువస్తాద్ అన్నారు. హిందూ సేవా సమాజ్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఎస్.రాజువస్తాద్, అధ్యక్షుడిగా సర్దార్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా నాగేశ్వర్‌రావు, పి.నరేష్‌సింగ్, పాపాలాల్‌సింగ్, పి.రాజు, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌చారి, టి.నర్సింగ్‌రావు, ఎం.హరి, రాజ్‌పాల్‌సింగ్, సునీల్ అమర్‌చంద్, ప్రధాన కార్యదర్శులుగా శోభరాణిపాండే, కృష్ణారావు, కోశాధికారిగా బాలాప్రసాద్‌తివారీ, న్యాయ సలహాదారులుగా ఐ.రమేష్, టికుల మహేశ్వర్‌రావు, శశికాంత్‌తివారీ ఎన్నికయ్యారు.

టీపీసీసీ మైనార్టీ శాఖ కార్యదర్శిగా మహమ్మద్ అమేర్ అలీ



నియామకపత్రాన్ని అందుకుంటున్న మహమ్మద్ అమేర్ అలీ

శాలిబండ: శాలిబండ డివిజన్ ఖాజీపురాకు చెందిన మహమ్మద్ అమేర్ అలీ టీపీసీసీ మైనార్టీ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ మైనార్టీ శాఖ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహేల్ చేతుల మీదుగా అమేర్ అలీ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


'నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది'



గౌరీ సతీష్

అబిడ్స్: రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రవళిక అశోక్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. నిరుద్యోగులు ఎవ్వరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లోనే అధికారంలోకి వస్తుందని రాహుల్‌గాంధీ చెప్పిన విధానం ప్రకారం..2 లక్షల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అందిస్తుందన్నారు. ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రభుత్వమే కారణమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



లంగర్‌హౌస్: ఎగ్జిబిషన్‌ల ద్వారా పిల్లాపాపలతో ఆనందాన్ని పొందుతున్నారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద శనివారం ఆయన ఇన్‌స్టాంట్ హ్యాండ్లూమ్ హాండిక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ పలు ఆటలు ఆడుతూ అందరిని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, నాయకులు వజీవుజ్జీ మా సిద్దికి, రాప్సన్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబయిన మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం
- నేటి నుంచి 23 వరకు ఉత్సవాలు
- సహస్రదీపోత్సవం, విశేష ఊంజల్ సేవ



మహంకాళేశ్వర ఆలయం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈసారి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నగరంలో మొట్టమొదటిసారిగా మీరాలంమండి అమ్మవారికి సహస్ర దిపోత్సవ సేవతో పాటు విశేష ఊంజల్ సేవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి 9 రోజుల పాటు నిర్వహించే కుంకుమార్చనలో క్రమం తప్పకుండా పాల్గొనే మహిళా భక్తులకు అమ్మవారి ప్రసాదంగా చీరలను బహుకరించనున్నారు. 9 రోజుల పాటు విశేషాలంకరణ పూజలతో పాటు 10 పారాయణంలు, చండీహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ప్రతిరోజూ..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ, చతుషష్ఠి ఉపచార మహాపూజ, 10 పారాయణంలు, చండీహోమం, పూర్ణాహుతి, నైవేద్యం, మంత్రపుష్పం, మహాదాశీర్వాదనం, తీర్థ ప్రసాద వితరణతో పాటు సాయంత్రం 5.30 గంటలకు సామూహిక సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం 6.30 గంటలకు సహస్ర దీపోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 8.05 గంటలకు పంచహారతి, సామూహిక హారతి, గౌరిపూజ తదితర పూజ కార్యక్రమాలతో పాటు పాటు 9 గంటలకు అన్నప్రసాదంతో పాటు రాత్రి 11.35 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయి.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు..

ఈనెల 15న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహాభిషేకం, అఖండ జ్యోతి, శతచండీ సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, ఋతిగ్వర్ణనం, సర్వతోభద్ర మండపరాధన, అంకురారోహణం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తాం..



గతంలో కన్న ఈసారి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించనున్నాం. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల సందర్భంగా పలువురు సినీ ప్రముఖులతో పాటు అధికార, అనధికార ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

– గాజుల అంజయ్య, ఆలయ కమిటీ చైర్మన్

ఆలయాలు ముస్తాబు..



దుర్గామాతను ప్రతిష్ఠించనున్న చెన్నకేశవ స్వామి సేవక్ మండపం

చాంద్రాయణగుట్ట: దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఉప్పుగూడ కాళికామాత ఆలయాన్ని నిర్వాహకులు ఇప్పటికే సుందరంగా ముస్తాబు చేశారు. చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ స్వామి సేవక మండపంలో ఈ ఏడాది స్థానిక భక్తులు దుర్గామాతను ప్రతిష్ఠించనున్నారు. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శరన్నవారాత్రోత్సవాల సందర్భంగా ప్రధానమైన ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పూర్వ వైభవాన్ని పొందేందుకు బీజేపీ కృషి

గోల్కొండ: ఒకప్పుడు నగరంలో బీజేపీ అంటే కార్వాన్ నియోజకవర్గం గుర్తుకు వచ్చేది. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి 1999 సంవత్సరం వరకు అప్రతిహతంగా విజయం సాధిస్తూ వచ్చారు. 1999లో జరిగిన కార్వాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ శకం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థులే గెలుస్తూ వస్తున్నారు. ప్రతిసారి బీజేపీ 2–3 స్థానానికే పరిమితమవుతూ వచ్చింది. గోల్కొండ సింహంగా పేరుగాంచిన దివంగత కార్వాన్ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి మజ్లిస్ ముందు నిలువలేకపోయారు. కాగా ప్రస్తుతం దేశంలో ప్రధాని మోదీ చరిష్మకు తోడుగా రాష్ట్రంలో బీఆర్ఎస్ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ కార్వాన్‌లో పుంజుకుంది. కాంగ్రెస్ బలం పుంజుకోవడం బీజేపీకి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోటగా ఉండే ముస్లిం, మైనార్టీల్లో మెజార్టీ వర్గం గతంలో మజ్లిస్ పక్షాన ఉండేది. అయితే మారిన పరిస్థితుల దృశ్యా ముస్లింలు చాలా మంది ఈ సారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీనికి తోడు దళితులను సైతం బీజేపీ నాయకులు తమవైపు తిప్పుకునేందుకు తగు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కార్వాన్‌లో బీజేపీకి ఓటు బ్యాంకు ఉందని అయితే మజ్లిస్, కాంగ్రెస్ ఓట్లను కొల్లగొట్టి ఈసారి విజయం సాధిస్తామని బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అంటున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి బీజేపీ అనుబంధ మోర్చాలైన కిసాన్‌మోర్చా, బీజేవైఎం, మహిళా మోర్చాలను పటిష్టం చేశారు. బీజేపీ నిర్వహించే వర్చువల్ సమావేశాలు కూడా విజయవంతం అవుతున్నాయి. కార్వాన్, లంగర్‌హౌజ్‌లలో సైతం బీజేపీ బాగా పుంజుకుంది. ఈసారి అభ్యర్థులు ఎవరైనా సరే గెలిపించుకుంటామని బీజేపీ నాయకులు అంటున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహిస్తు ఎప్పటికప్పుడు నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులను తమ వైపు తిప్పుకుంటే విజయం తమదేనని బీజేపీ గట్టి నమ్మకంతో ఉంది.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలి



గన్‌పార్కు వద్ద నిరసన తెలుపుతున్న ముదిరాజ్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత ప్రాధాన్యతను కల్పించాలని ముదిరాజ్ చైతన్య వేదిక డిమాండ్ చేసింది. శనివారం ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి గన్‌పార్కు అమరవీరుల స్థూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణలో 60 లక్షలకు పైగా జనాభా ఉన్న ముదిరాజ్‌లను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పించిన రాజకీయ పార్టీలకు తాము మద్దతు ఇస్తామని లేని యెడలా తమ సత్తాను చాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ చైతన్య వేదిక సంఘం నాయకులు కురుమూర్తి, ప్రేమలత ముదిరాజ్, నర్సింహా ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



బషీర్‌బాగ్‌చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

గన్‌ఫౌండ్రీ: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీసీ సంఘాలు మండిపడ్డాయి. పొన్నాల లక్ష్మయ్యకు రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ చౌరస్తాలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాల ప్రజలపై రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఆపాలని లేని యెడలా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ పద్ధతి మానుకోకపోతే రేవంత్‌రెడ్డిని ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు టి.విక్రమ్‌గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్యామ్‌కురుమ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్

చార్మినార్: ఉమెన్ రిజర్వేషన్ బిల్లు–2023పై జాతీయ స్థాయి సెమినార్‌ను వచ్చే నెల 9,10 తేదీలలో నిర్వహించనున్నామని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. సిటీ కాలేజీలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సెమినార్ కన్వీనర్, ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఈ.పావనితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ సెమినార్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా కొనసాగుతుందన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానామిక్స్ ఆధ్వర్యంలో ఈ సెమినార్ జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

నాంపల్లి: క్యాట్ డిగ్రీ కళాశాలలో శనివారం 28వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మల్లేష్‌యాదవ్ మాట్లాడుతూ..తమ సంస్థలో ఎందరో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఎన్నో అత్యున్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. ఉత్తమ అధ్యాపకులతోనే తమ సంస్థకు మంచి పేరు వచ్చిందని పేర్కొన్నారు.



నాసా స్పేస్ యాప్స్ ఛాలెంజ్ పోటీకి జీఎన్ఐటీఎస్ విద్యార్థులు




ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

గోల్కొండ: నాసా నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ యాప్స్ ఛాలెంజ్ పోటీకి షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఛండీగర్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఎంపికకావడం తమ విద్యా సంస్థకే గౌరకారణమని జీఎన్ఐటీఎస్ చైర్మన్ కె.రాఘువరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పెస్ యాప్, సుమన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్పసన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ కె.రమేష్ రెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఎస్.రాంచరణ్, విజయ్ కుమార్, మమత తదితరులున్నారు.

ఆత్మహత్యలొద్దు.. కొట్లాడి సాధించుకోవాలి



చార్మినార్: కొట్లాడి సాధించుకోవాలి తప్పా.. ఆత్మహత్యలు చేసుకోవద్దని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. విద్యార్థులకు సరైన జీవనోపాధి కల్పించకుండా సకాలంలో ప్రభుత్వ నోటిఫికేషన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆయన విద్యార్థులకు హితవు పలికారు. ఆత్మహత్యకు గురైన ప్రవల్లిక సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ఎంతో బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు తమ విలువైన ప్రాణాలను బలివ్వద్దొన్నారు. ప్రవల్లిక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాంపల్లి: రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలు నుంచి జారి కిందపడ్డారు. ఈ ఘటనలో అతడి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

గౌలిపురా: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ బాలిక అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ జూబేర్ కూతురు ఆస్పియా బేగం (17) మానసిక వ్యాధితో పడుతుంది. దీంతో కుటుంబసభ్యులు ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. కాగా ఆస్పియా బేగంకు కుటుంబసభ్యులు ఎప్పుడు ఇంట్లో గొలుసులతో కట్టి ఉంచేవారు. ఈనెల 12న ఆస్పియా బేగం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువత సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



సమావేశంలో శ్రీకాంత్‌చారి తదితరులు

గోల్కొండ: యువకులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. సమితి కార్యవర్గ సమావేశం శనివారం గోల్కొండ రిసాలబజార్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సేవా సమితి తరఫున సంవత్సరం పొడవున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వీటిలో స్థానిక యువత కూడా పాల్గొనేలా చేస్తామన్నారు. నిరుపేదలు, వృద్ధులు, ప్రతిభ గల విద్యార్థుల కోసం కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించామని ఆయన అన్నారు. వృద్ధులకు నిత్యవసరాలను పంపిణీ చేస్తామని, అదే విధంగా మహిళల స్వయం ఉపాధి కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బొమ్మల సాయిబాబాచారి, రాహుల్‌చారి, శివ, లడ్డూ, సంతోష్, జగదీష్, సురేష్‌చారి తదితరులున్నారు.

పరమశివునికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురా బతుకమ్మ బావి సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్యగుప్తా, సలహాదారులు చీల రాములుగుప్తా, సరాబు విశ్వేశ్వరయ్యగుప్తా, అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, బెజగం చంద్రమోహన్, గుబ్బ శ్రీనివాస్, ముక్క శేఖర్, శిరంగి సంతోష్, గౌరిశెట్టి విశ్వనాథం పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తా చెదారం



ధూల్‌పేట బల్‌రామ్‌గల్లీ ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఉన్న చెత్త

అబిడ్స్: ప్రభుత్వ ఆస్పత్రికి అనుకుని రోడ్డుపై చెత్తా చెదారం పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ధూల్‌పేట బల్‌రామ్‌గల్లీలో ఉన్న ప్రభుత్వ దవాఖానా పక్కన చెత్తా చెదారం ఉంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పలుసార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ తివారి (గుళ్లు మహారాజ్) మాట్లాడుతూ..ఇంతకు బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందా..? అని ప్రశ్నించారు. బల్‌రామ్‌గల్లీలో ప్రభుత్వ దవాఖానా పక్కనే చెత్తాచెదారం నిండిపోయి పది రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర వ్యాధులు సంభవిస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామా..



ఐఎంపీఎస్‌లో మిత్రకృష్ణ, మిథిలేష్ కుమార్

జియాగూడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీకా అని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శనివారం జియాగూడ ఎంసీహెచ్ కేంద్రంలో ఇంద్రాణి మహా విద్యాలయ స్కూల్ డైరెక్టర్ మిథిలేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన బతుకమ్మ సంబరాలకు మిత్ర కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మ పూజ, వేదికపై వివిధ రూపాల మాతేశ్వరీల వేషధారణలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఇంద్రాణి, దివ్యజ్యోతి, ఇన్‌ఛార్జ్ అర్చన, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సిటీ కాలేజీలో..

చార్మినార్: సిటీ కాలేజీలో బతుకమ్మ ఆటలు ఘనంగా జరిగాయి. అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి కళాశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆటలు ఆడారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే ఏబీవీపీ కోఠి జిల్లాలోని చార్మినార్ నగర శాఖ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కన్వీనర్ సభావట్ కల్యాణ్‌తో పాటు ఏబీవీపీ కళాశాల అధ్యక్షులు సజన్, నగర కార్యదర్శులు రాహుల్, కౌశిక్, సందీప్, జితేందర్ పాల్గొన్నారు.



సిటీ కాలేజీలో..



వివిధ మాతేశ్వరీ వేషధారణలో విద్యార్థులు



ఏబీవీపీ ఆధ్వర్యంలో..